క్లుప్తంగా

ప్రజల పక్షాన పోరాడుతాం

గజ్వేల్: ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు గాడిపల్లి భాస్కర్, మాదాడి జశ్వంత్‌రెడ్డి, టీకులపల్లి రాంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రిమ్మనగూడలో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేవలం 28 రోజుల వ్యవధిలోనే బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 66,653 పైచిలుకు ఓట్లు వేసి బలమైన పార్టీగా నిలిపిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈటల సైతం ఇక్కడి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటారని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు సింగం సత్తయ్య, సురేశ్‌గౌడ్, మల్లం రాజు, రామచంద్రారెడ్డి, సుభాశ్‌చంద్రబోస్, రామచంద్రచారి, హైదర్‌ఎక్బాల్, మల్లేశం, గుమ్మడి శ్రీనివాస్, రాందాస్‌గౌడ్, అమృతరెడ్డి, మర్రుక్ రాంరెడ్డి పాల్గొన్నారు.

అశ్వినికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న అశ్విని

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన అశ్విని డాక్టరేట్ అందుకున్నారు. మెదక్ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ప్రొఫెసర్ ఎం. రవీందర్ పర్యవేక్షణలో హెటిరోసైక్లిక్ డెరివేటివ్ సంశ్లేషణ, వాటి కేన్సర్ వ్యతిరేక మూల్యాంకనంపై పరిశోధన జరిపింది. దీనికి గానూ చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ హైదరాబాద్ చాన్స్‌లర్ పురుషోత్తంరెడ్డి సోమవారం డాక్టరేట్‌ను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్, ఆర్సీఓ, సిబ్బంది అశ్విని ని అభినందించారు.

కో–ఆప్షన్ సభ్యురాలు రాజీనామా

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యురాలు రుక్సార్ ఖనమ్(బీఆర్‌ఎస్) సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. అనివార్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్‌కు రాజీనామా లేఖ అందచేశారు. ఆదివారం ఆమె భర్త వహీద్‌ఖాన్ కాంగ్రెస్‌లో చేరడం విశేషం.

అందరికీ విద్య అందించడమే లక్ష్యం

దౌల్తాబాద్(దుబ్బాక): బడి ఈడి పిల్లలందరికీ విద్య అందించడమే లక్ష్యంగా బడి బయట పిల్లలపై సర్వే నిర్వహిస్తున్నామని మండల విద్యాధికారి బండి నర్సవ్వ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని లింగరాజుపల్లి, నర్సంపేట తదితర గ్రామాల్లో బడి బయట పిల్లలపై సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ..18 ఏళ్ల లోపు పిల్లలంతా కళాశాలలో చేరి విద్యనభ్యసించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుతీనగర్, బృందవన కాలనీ, హరిహర రెసిడెన్సీ, ఎల్‌బీసీ కాలనీ, ఆదర్శనగర్, కుషాల్‌నగర్, శ్రీనివాస్‌నగర్, సాజీద్‌పుర పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

కన్యకాపరమేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి మాతకు సోమవారం మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకాలతో పాటు పూలు, పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించారు.భక్తులు 141 కళశాలతో అమ్మవారికి పూజ చేసి 108 రకాల హారతులు సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో పాటు ఆలయ ప్రధాన అర్చకులు శంకరశర్మ, భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే పట్టణానికి చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు కార్తీకమాసం పురస్కరించుకొని సుమారు వెయ్యికిపైగా చిన్న పది పైసల నాణెలతో మహా శివలింగం రూపాన్ని చిత్రించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాలకవర్గం కొలువుదీరేనా?

- కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీకి గ్రహణం
- తొమ్మిదేళ్లుగా మరుగున పడుతున్న ప్రక్రియ



కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం

కొండపాక(గజ్వేల్): గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం తొమ్మిదేళ్లుగా కొలువుదీరలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైన ఏర్పాటు చేస్తుందా లేదా అన్న ప్రచారం సాగుతోంది. సుమారు ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని గోదాంలలో నిల్వ చేసుకునేందుకు అనువుగా మోడల్‌గా మార్కెట్ భవనాన్ని నిర్మించారు. మూడెకరాల ప్రభుత్వ భూమిలో రూ. 3.70 కోట్లతో మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించింది. సుమారు 9 ఏళ్లు అయినప్పటికీ పాలకవర్గాన్ని నియమించలేదు. గతంలో దుబ్బాక నియోజకవర్గంలోని తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంలో కొండపాక మార్కెట్ కమిటీ వ్యవస్థ కొనసాగేది. విభజనలో భాగంగా తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నుంచి కొండపాక మండలం విడిపోయింది. ఈక్రమంలోనే కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని జనరల్ కోటాలో రిజర్వు చేస్తూ అప్పటి ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. మార్కెట్ కమిటీకి ఏటా కోట్లాది రూపాయల టాక్స్ వసూలు అవుతున్నాయి. ఇదే అదనుగా భావించిన బీఆర్‌ఎస్ పాలకపెద్దలు పాలకవర్గం ఏర్పడకుండా మరుగున పెట్టారనే ప్రచారం సాగింది. దీనికి తోడు మండలంలో ప్రజాప్రతినిధులుగా కొనసాగిన పెద్దలు వారి వారి అనుచరులకు చైర్మన్ పదవిని కట్టబెట్టుకునే దిశగా పైరవీలు ముమ్మరం చేశారు. దీంతో చైర్మన్ ఎంపిక ప్రక్రియ విషయం తలనొప్పిగా మారిందంటూ ప్రచారం సాగింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకంపై దృష్టి పెట్టాలని ఆయా గ్రామాల రైతులు, నాయకులు కోరుతున్నారు.

మార్కెట్‌కు ఆదాయం తెచ్చిపెట్టేవి..

కాటన్ మిల్లులు, రైస్ మిల్లులు, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు (పీఏసీఎస్, ఐకేపీ)ల నుంచి ఆదాయం సమకూరుతుంది. మండలంలో వనరులను బట్టి ఏటా మార్కెట్ కమిటీకి రూ.1 కోటి 50 లక్షలు ఆదాయం వస్తుంది. పాలకవర్గంలోని 18 మంది సభ్యుల్లో కేవలం చైర్మన్‌కు మాత్రమే ప్రభుత్వం నుంచి నెలకు రూ. 15 వేల పారితోషిక గౌరవ వేతనం లభిస్తుంది. ప్రతీ రెండేళ్లకోసారి పాలకవర్గం నియామకం మారుతుంది. ప్రభుత్వం అనుకుంటే మరో ఏడాది పాటు పెంచుకునే అవకాశం ఉంటుంది.

మంత్రి పదవి హుస్నాబాద్ భిక్షే..

రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజలకు అభివాదం తెలుపుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: మంత్రి పదవి హుస్నాబాద్ పెట్టిన ప్రాణ భిక్ష అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంత్రిగా నియమితులై హుస్నాబాద్‌కు మొదటిసారి వచ్చిన సందర్భంగా సోమవారం రాత్రి కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా రెండు గ్యారంటీలను అమలు చేశామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో అక్కా చెల్లెమ్మలు ఉచితంగా ప్రయాణం చేస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హుస్నాబాద్‌కు వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ హుస్నాబాద్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని.. ఆ బాధ్యత నాదే అని స్పష్టం చేశారు. ఈరోజే హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దేవాదుల, గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కాలువలకు రూ. 250 కోట్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎవరు ఊహించని విధంగా జిల్లాను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తానన్నారు. కరీంనగర్‌లో ఓడిపోయినా మళ్లీ రాజకీయ జన్మనిచ్చిన హుస్నాబాద్‌ను మరిచిపోనన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

గురువన్నపేటలో విషాదం

కొమురవెల్లి(సిద్దిపేట): జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని గురువన్నపేటకు చెందిన నలుగురు కూలీలు మృతిచెందిన విషయం విధితమే. రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందిన పుట్ట జయమ్మ, వైనాల శిరిషతో పాటు చికిత్స పొందుతూ మృతిచెందిన గుర్రాల లక్ష్మి, దాసారపు మల్లవ్వ మృతదేహాలను సోమవారం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం గురువన్నపేటకు చేరుకోగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, కన్నీరుమున్నీరుగా విలపించారు. బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ. 25 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశాడు. హైదరాబాద్ ఘట్‌కేసర్‌లోని నీలిమ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గురువన్నపేట క్షతగాత్రులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ పరామర్శించారు.

బొమ్మ వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి



హుస్నాబాద్: నివాళులర్పిస్తున్న పలు పార్టీల నాయకులు

హుస్నాబాద్/కోహెడ(హుస్నాబాద్): దివంగత మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్లు ఈ ప్రాంతానికి చేసిన సేవలు మరువలేనివని పలు పార్టీల నాయకులు కొనియాడారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బొమ్మ వెంకటేశ్వర్లు హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. హుస్నాబాద్‌లో కోర్టు, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంలో అయన కృషి ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు కోమటి స్వర్ణలత, వల్లపు రాజు, సరోజన, అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, నాయకులు ఎండీ. హస్సేన్, అక్కు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కోహెడ మండల కేంద్రంలోని ఇందుర్తిలో మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్న జయంతిని మున్నూరు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గాజుల వెంకటేశ్వర్లు, గుగ్గిళ్ల శ్రీనివాస్, సుధాకర్, మల్లారెడ్డి, జగన్, తిరుపతి, రాంచంద్రారెడ్డి, రాములు పాల్గొన్నారు.

మంత్రి 'పొన్నం'కు ఘనస్వాగతం



వర్గల్: మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



కోహెడరూరల్: అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పొన్నం

వర్గల్(గజ్వేల్)/కోహెడరూరల్/నంగునూరు: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సోమవారం వర్గల్ మండలం గౌరారం వద్ద కాంగ్రెస్ శ్రేణులు, గౌడ సంఘ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డితో కలిసి వచ్చిన మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రజల సమస్యలు వినే పరిస్థితి ఉండేదికాదని, సమస్యలు వినడం, వాటిని పరిష్కరించేదిశగా ముందుకుసాగడం తమ ప్రభుత్వ పాలసీగా పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింలుగౌడ్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నర్సింలు, నాయకులు భానుప్రసాద్, కరుణాకర్, రాజుగౌడ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కోహెడ మండలం బస్వాపూర్ గ్రామ శివారులో పొన్నం, మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణకు కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. మండల పార్టీ అధ్యక్షుడు మంద ధర్మయ్య ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బస్వారాజు శంకర్, మాజీ సర్పంచ్‌లు జగన్‌రెడ్డి, సుధాకర్, బాలకిషన్, శ్రీనివాస్, జయరాజ్, తదితరులు పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు గంప మహేందర్‌రావు ఆధ్వర్యంలో నంగునూరు మండలం రాజగోపాలపేట చేరుకున్న మంత్రికి డప్పులతో ఘన స్వాగతం పలికి సత్కరించారు.

మంత్రిని కలిసిన నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మంత్రి పొన్నం ప్రభాకర్‌ను నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నర్సయ్య, రవి, డీవీ రావు, మల్లికార్జున్, మల్లేశం బస్వాపూర్‌లో కలిసి సన్మానించారు.

మల్లన్న ఆశీస్సులతోనే గెలుపొందా..



స్వామివారిని దర్శించుకుంటున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలుపొందానని.. అందుకే మొదటగా స్వామి వారి మొక్కుతీర్చుకున్న తర్వాతే పర్యటన మొదలుపెట్టానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్వామి వారిని పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రధాన సమస్య అయిన చేర్యాల రెవెన్యూ డివిజన్‌ను సాధించడమే తన లక్ష్యమన్నారు. అధికారంలో తమ ప్రభుత్వం లేకపోయిన జనగామ ప్రాంత అభివృద్ధి నిత్యం జరుగుతుందని హామీ ఇచ్చారు. గతంలో వ్యవసాయనికి నీరు అందించే కాలువలు పూర్తి కాలేదని వాటిని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ తలారి కీర్తన, జెడ్పీటీసీ సిద్దప్ప, కొమురవెల్లి, మద్దూరు మండల పార్టీ అధ్యక్షులు భిక్షపతి, మేక సంతోష్, సార్ల కిష్టయ్య, గొల్లపల్లి కిష్టయ్య, కొండ శ్రీధర్, రసులాబాద్ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఈఓ బాలాజీ, ఏఈఓలు అంజయ్య, శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, ఒగ్గు పూజారులతో కలిసి ఘనస్వాగతం పలికారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి..

చేర్యాల(సిద్దిపేట): తమ పార్టీ అధికారంలో లేకపోయినా ఎమ్మెల్యేగా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సోమవారం మొదటిసారి పట్టణ కేంద్రానికి వచ్చారు. పట్టణ కేంద్రంలోని దర్గాతో పాటు పలు దేవాలయాలను సందర్శించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, ఎంపీపీలు ఉల్లంపల్లి కరుణాకర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): ఉమ్మడి మద్దూరు మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. కమాలయపల్లి సర్పంచ్ మాట్లాడుతూ.. తమ గ్రామానికి ఇప్పటివరకు మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు అందడం లేదని ప్రశ్నించారు. బైరాన్‌పల్లి, నర్సయపల్లి గ్రామాల్లో ఇళ్లపై విద్యుత్ తీగలు ఉన్నాయిని, వాటిని తొలగించాలని సర్పంచ్‌లు అధికారులు కోరారు. అలాగే హనుమతండాలో సబ్‌స్టేషన్ మంజూరు అయిందని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. రెండో విడత గొర్రెల డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు గొర్రెలు ఎప్పుడు ఇస్తారని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అడగగా.. రెండు రోజుల్లో ఈవిషయంపై సమీక్ష నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. బైరాన్‌పల్లి, వంగపల్లి, దుబ్బతండా, హనుమతండ గ్రామాలకు నూతన పంచాయతీ భవనాలు మంజూరయ్యాని పంచాయతీరాజ్ శాఖ అధికారి తెలిపారు. అనంతరం ఎంపీపీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ

చివరి సోమవారం భక్తుల ప్రత్యేక పూజలు



కూడవెల్లిలో భక్తుల ప్రత్యేక పూజలు

దౌల్తాబాద్(దుబ్బాక)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆది శివరాములు ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణ వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ పద్మశాలి సమాజం అధ్యక్షుడు కాముని రాజేశం, పద్మశాలి సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ గోనె మార్కండేయులు, పద్మశాలి సమాజం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కూడవెల్లిలో ప్రత్యేక పూజలు

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట- భూంపల్లి మండలం కూడవెల్లి రామలింగేశ్వరస్వామి, చౌదర్‌పల్లిలోని దుబ్బరాజేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

చట్టాలపై అవగాహన

తొగుట(దుబ్బాక): కేజీబీవీ విద్యార్థులకు తొగుట సీఐ కమలాకర్ అవగాహన కల్పించారు. పాఠశాల ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని తెలిపారు. మహిళల రక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోండి

మిరుదొడ్డి(దుబ్బాక): మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్ల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్య కోరారు. సోమవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. అంతంత మాత్రమే ఉపాధి పొందే ఆటోడ్రైవర్ల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు వజ్జెపల్లి రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలని కోరారు.

బెంచీల పంపిణీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సికింద్రాబాద్‌కు చెందిన లింగ హరీశ్‌గాంధీ తన తండ్రి జ్ఞాపకార్థం బెంచీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సైదులు, సత్తయ్య, సికింద్రాబాద్ లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

తొగుట(దుబ్బాక): మండలంలోని ఘనపురంలో నిరుపేద కుటుంబానికి చెందిన వన్నెల్లి సత్తవ్వ కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతంది. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన ఉప్పునూతల రామస్వామి సోమవారం ఆమెను పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశాడు.

ఐలయ్యకు కాకతీయ మహానంది అవార్డు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఎలికట్టె ఐలయ్యకు కాకతీయ మహానంది అవార్డు దక్కింది. మూడున్నర దశాబ్దాలుగా సాహిత్యం, ఇంద్రజాల ప్రదర్శనతో సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్న ఐలయ్య ఏఎస్‌ఎస్-24 టీవీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకులు అవార్డు అందజేశారు. చేర్యాల రచయితల సంఘం ప్రతినిధులు ఐలయ్యను అభినందించారు.

బహిరంగ వేలం

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన టీవీఎస్ ఎక్సెల్‌కు మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు.

హ్యాపీ జర్నీ..

రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్టాండ్లు సందడిగా మారాయి. సోమవారం దుబ్బాక నుంచి సిద్దిపేటకు వెళ్లే బస్సులు మహిళా ప్రయాణికులతో రద్దీగా మారాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని మహిళలు హర్షం వ్యక్తం చేశారు. – దుబ్బాక



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990